క్లుప్తంగా

విద్యా సామగ్రి వితరణ

బి.కొత్తకోట: మండలంలోని జరప్పల్లె ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అన్నపూర్ణ ఫౌండేషన్ తరపున శనివారం నోటు పుస్తకాలు, పెన్నులు, కాపీ రైటింగ్ పుస్తకాలను పంపిణీ చేశారు. 20 మంది విద్యార్థులు వీటిని అందుకున్నారు. ఎంఈవో రెడ్డిశేఖర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శీనునాయక్ పాల్గొన్నారు.

సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకుంటేనే ఓటు హక్కు

పెద్దతిప్పసముద్రం: స్థానిక సొసైటీ బ్యాంకులో రైతులకు ఉన్న ఓటు హక్కు కొనసాగాలంటే సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవాలని బ్యాంకు సీఈఓ చంద్రశేఖర్, పర్సన్ ఇన్‌చార్జి శ్యాం ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వారు మాట్లాడుతూ సహకార సంఘాల కంప్యూటరీకరణ కారణంగా సొసైటీలో ఓటు హక్కు ఉన్న ప్రతి రైతు పట్టాదార్ పాసు పుస్తకం, ఆధార్, రేషన్ కార్డు, పాన్ కార్డు, రెండు ఫొటోలను అందజేసి సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవాలని, లేకుంటే ఓటు హక్కు రద్దు అవుతుందన్నారు.

ఏపీ స్టూడెంట్స్ జేఏసీ కార్యవర్గం ఎన్నిక

వాల్మీకిపురం: ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జేఏసీ పీలేరు నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని శనివారం వాల్మీకిపురంలోని శ్రీనివాస ఐటీఐ కళాశాలలో చదువుతున్న విద్యార్థులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీలేరు నియోజకవర్గ అధ్యక్షులుగా మల్లికార్జున, కార్యదర్శిగా సాదిక్, ఉపాధ్యక్షులుగా హేమంత్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా కిరణ్ కుమార్, గణేష్, సాయిషా వలి, హరిహరన్, సిద్దార్థ్, విష్ణువర్దన్, వెంకటరమణ, అరవింద్‌లు ఎన్నికైనట్లు ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వలిపి ఉత్తన్న తెలిపారు. ప్రత్యేక హోదా ఉద్యమానికి విద్యార్థులు ముందడుగువేయాలని జిల్లా అధ్యక్షులు గంగరాజు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు పాల్గొన్నారు.

వేలం పాట ద్వారా పంచాయతీకి ఆదాయం



వేలం నిర్వహిస్తున్న డీఎల్‌పిఓ నాగరాజ

వాల్మీకిపురం: వాల్మీకిపురం గ్రామ పంచాయతీకి సంబంధించి శనివారం పంచాయతీ కార్యాలయంలో జరిగిన వేలం పాటల్లో పంచాయతీకి రూ.11,21,700 ఆదాయం వచ్చినట్లు డీఎల్‌పిఓ నాగరాజ తెలిపారు. ఈ ఏడాది రుసుము వసూళ్లకు సంబంధించి నిర్వహించిన వేలం పాటలు పోటాపోటీగా సాగాయి. వారపు సంత రూ. 7,98,000, దినసరి మార్కెట్ రూ.2,23,000, జంతువధశాల రూ.1,00,700 వేలంలో పాడుకున్నారు. కార్యక్రమంలో ఈవో ఉదయ్ కుమార్, సర్పంచ్ గంగులమ్మ, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, పంచాయతీ సిబ్బంది, వేలంపాటదారులు తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



దాతలు పంపిణీ చేసిన విద్యాసామగ్రితో విద్యార్థులు

కేవీపల్లె : విద్యార్థులు అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓలు రెడ్డిబాషా, సుబ్రమణ్యంరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గ్యారంపల్లె పంచాయతీ జి.కొత్తపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దాతలు ఎంపీటీసీ సూర్యనారాయణ రెడ్డి, ఎల్లారెడ్డి రూ. 7 వేలు విలువైన విద్యా సామగ్రి వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల అభివృద్ధికి దాతలు సాయం చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు సెల్ ఫోన్లకు, టీవీలకు దూరంగా ఉండి బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బి. చంద్రశేఖర్, ఉపాధ్యాయులు నాగమ్మ, ప్రసన్నలక్ష్మీ, సర్పంచ్ రెడ్డెయ్య, వెంకటరమణారెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవతోనే గుర్తింపు



వీఆర్‌ఓ, ఆఫీసు సబార్డినేట్ దంపతులను సన్మానిస్తున్న తహసీల్దార్

తంబళ్లపల్లె: ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అందించిన సేవలతోనే మంచి గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు. శనివారం రెవెన్యూ కార్యాలయ సమావేశపు హాలులో పదవీ విరమణ చేస్తున్న గుండ్లపల్లె విఆర్‌ఓ పూజారి వెంకటరమణ, రెవెన్యూ కార్యాలయం ఆఫీసు సబార్డినేటర్ రామకృష్ణ దంపతులను శాలువాలతో సత్కరించారు. వారు విధి నిర్వహణలో చూపిన చొరవ, ప్రజాసేవలను కొనియాడారు. వారి శేష జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ ఆనంద్, డీటీ మౌలాలి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చౌడేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం



వాల్మీకిపురం: లోక్‌అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న జడ్జి గురు అరవింద్

వాల్మీకిపురం: రాజీమార్గమే రాజమార్గమని వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి గురు అరవింద్ అన్నారు. శనివారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భమగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అవగాహన లేక క్షణికావేశంలో కక్షలకుపోయి కేసులు పెట్టుకొని జీవితాలను దుర్భరం చేసుకోరాదని సూచించారు. రాజీ చేసుకోదగిన కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని చెప్పారు. ఈ దిశగా న్యాయవాదులు, సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. మొత్తం కార్యక్రమంలో సివిల్, క్రిమినల్, బ్యాంకు రుణాలు తదితరానికి సంబంధించి మొత్తం 43 కేసులు రాజీ అయ్యాయన్నారు. ఈ కేసులకు సంబంధించి రూ.22,30,344 నగదు రికవరీ అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ద్వారకనాథ రెడ్డి, ఆనంద కుమార్, రవి ప్రకాష్, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

19 కేసులు పరిష్కారం

తంబళ్లపల్లె: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఇన్‌చార్జ్ న్యాయమూర్తి శిరీషా అధ్యక్షతన 19 కేసులు ఇరువర్గాల కక్షిదారుల సమ్మతితో పరిష్కరించారు. కేసులకు సంబంధించి సెటిల్‌మెంట్ ద్వారా రూ.24,64,576 వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, ఏపీపీ రామకృష్ణ, లాయర్ నాగమల్లారెడ్డి, లోక్‌అదాలత్ సిబ్బంది గురుప్రసాద్, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



పీలేరులో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్

పీలేరులో 64 కేసులు..

పీలేరు రూరల్ : కక్షిదారులకు కేసుల పరిష్కారంలో రాజీమార్గమే రాజమార్గమని సీనియర్ సివిల్ జడ్జి కె. రవి అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో ఇరువర్గాలను ఒప్పించి 64 కేసులు పరిష్కారించారు. కాగా రూ. 1,70,22,898 రికవరీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.సి పురుషోత్తంరెడ్డి, న్యాయవాదులు చిన్నరెడ్డెప్ప, నిరంజన్, జయశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



తంబళ్లపల్లె: మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ జడ్జి శిరీషా

ఆరు కేసులు..

పెద్దతిప్పసముద్రం: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులను ఛేదించేందుకు ఎస్ఐ రవీంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో రాజీ మార్గమే రాజమార్గం అని సూచిస్తూ, ఏళ్ల కొద్దీ నిత్యం కోర్టులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ జీవితాలను నాశనం చేసుకోకుండా సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని పలువురికి హితబోధ చేశారు. శనివారం తంబళ్ళపల్లిలో జరిగిన లోక్ అదాలత్‌లో మండలానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న వాటిలో ఆరు కేసులు పరిష్కారమైనట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేద్దాం

- ముున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా
- ఎక్స్ అఫిషియో మెంబర్‌గా ప్రమాణ స్వీకారం
- రాజకీయాలకు అతీతంగా పనిచేద్దామని పిలుపు
- డయేరియాపై దృష్టి సారించాలన్న వైఎస్సార్ సీపీ కౌన్సిల్ సభ్యులు
- రూ.1.5 కోట్లతో ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా



మున్సిపల్ ఎక్స్ అఫిషియో మెంబర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : రాజకీయాలకు అతీతంగా, పార్టీలతో పనిలేకుండా మున్సిపల్ కౌన్సిల్, అధికారులందరి సహకారం, సమన్వయంతో మదనపల్లె పట్టణ అభివృద్ధే ధ్యేయంగా పనిచేద్దామని ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. సమావేశానికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం, ఎక్స్ అఫిషియో మెంబర్‌గా ప్రమాణ స్వీకారానికి వచ్చిన షాజహాన్‌బాషాకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్ జింకాచలపతి, నూర్‌ఆజం, కౌన్సిల్ సభ్యులు ఎమ్మెల్యేను దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. తొలుత... టీడీపీ కౌన్సిలర్ తులసీరామకృష్ణ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశంలో ఏర్పాటుచేసిన ఎన్‌టీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా నివాళులు అర్పించారు. అనంతరం కౌన్సిల్ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ..మదనపల్లె పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్ది, ప్రజలందరికీ అవసరమైన మౌలికవసతులు కల్పించేదిశగా, పేదవాడికి గూడు కల్పించడమే ధ్యేయంగా ముందుకెళదామన్నారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, రోడ్లు గుంతలమయంగా మారాయని, ట్రాఫిక్‌సమస్య తీవ్రంగా ఉందని చెప్పుకొచ్చారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా కొత్త మాస్టర్‌ప్లాన్ తయారుచేయించి, 500 కోట్లతో పలు ప్రాంతాల్లో ఫ్లైఓవర్ల నిర్మాణం చేస్తామన్నారు. మున్సిపాలిటీకి చెందిన బీకే.పల్లె కాలనీలో కోట్లరూపాయల విలువచేసే ప్రభుత్వస్థలాలు ఆక్రమణకు గురయ్యాయని, తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి, ఆక్రమణల నిగ్గుతేల్చి, ఇల్లు లేని పేదవాడికి గూడు ఇచ్చేందుకు సహకరించాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి మాట్లాడుతూ..మున్సిపల్ పట్టణ అభివృద్ధికి కౌన్సిల్‌కు సహకరించాల్సిందిగా కోరారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి మాట్లాడుతూ... పట్టణానికి 24కిలోమీటర్ల దూరంలోని వాల్మీకిపురంలో డయేరియా తీవ్రంగా ఉందని, పట్టణ ప్రజలను అప్రమత్తం చేసి, నిరోధక చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను కోరారు. డయేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించి, తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కౌన్సిలర్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ..పట్టణ ప్రజల తాగునీటిసమస్య పరిష్కారానికి ట్యాంకర్ల ద్వారా రవాణా చేసేందుకు రూ.1.5 కోట్లతో అజెండాలో ప్రతిపాదనలు పెట్టారని, సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు కృషిచేయాలన్నారు. కౌన్సిల్ సమావేశంలో భాగంగా అజెండాలోని 71 అంశాలకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సికెల్ సెల్ వ్యాధిపై అవగాహన అవసరం



అవగాహన పోస్టర్లను ప్రదర్శిస్తున్న వైద్య సిబ్బంది

కలకడ : సికెల్ సెల్ వ్యాధిపై అవగాహన అవసరమని మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ జవహర్‌బాబు అన్నారు. శనివారం పాపిరెడ్డిగారిపల్లెలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సికెల్ సెల్ అనేది అత్యంత ప్రమాదకరమైనదని, రక్తహీనత లోపంతో ఈ వ్యాధి వ్యాప్తి చెందే అవకావం ఉందని తెలిపారు. పురుషులకంటే మహిళలలో అధికశాతం వ్యాపించే అవకాశం ఉందని, తరచూ జ్వరం వస్తూ, ఎర్రరక్తకణాలు తగ్గిపోవడంతో జీవితకాలం తగ్గుతుందని గుర్తు చేశారు. ఈవ్యాధి గ్రస్తులు మంచి పోషక ఆహారం తీసుకోవాలన్నారు. రక్తపరీక్షలను ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంచితంగా చేస్తారని, అనుమానం కలిగిన వ్యక్తులు రక్తపరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, పీహెచ్‌ఎన్ సుబ్బరత్నమ్మ, సూపర్‌వైజర్‌లు వెంకటేశ్వరరావు, సిబ్బంది భారతమ్మ, షరీఫ్, జమీల్, వాణి, వరలక్ష్మి, అలివేలు, మంగభాయ్, సునీత, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పని చేయాలి

– ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

పీలేరు : అధికారులు బాధ్యతగా పని చేయాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డులు పార్టీ కార్యకర్తల సమావేశం అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందించాలని ఆదేశించారు. జూలై నెలలో రూ. 7 వేలు పింఛన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రతి నెలా రూ. 4 వేలు వస్తుందని, అనర్హులుంటే తొలగిస్తామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో భూదందాలో అధికారుల పాత్ర కూడా ఉందని, వీటన్నంటిపై విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. టీడీపీకి అధికారం వచ్చింది కదా అని పార్టీ నాయకులు, కార్యకర్తలు భూ దందాలు గానీ, దాడులు చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటపల్లె బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రామ్మూర్తి, అమరనాథరెడ్డి, కంచి సూరి, నారే సతీష్‌రెడ్డి, ఆతికాషఫీ, రాజ పాల్గొన్నారు.

రోడ్లపైనే టమటా ట్రాక్టర్లు



చౌడేశ్వరి సర్కిల్ వద్ద నిలిచిపోయిన వాహనాలు

మదనపల్లె సిటీ: మదనపల్లె టమటా మార్కెట్‌కు టమటాలు ముంచెత్తుతున్నాయి. దీంతో టమటా మార్కెట్ నుంచి చౌడేశ్వరి సర్కిల్ వరకు రోడ్లపై టమటా ట్రాక్టర్లు, మిని టెంపోలు, ఆటోలు ఆగిపోయాయి. రోడ్లపై వాహనాలు నిలబడిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శనివారం సాయంత్రం మదనపల్లె టమటా మార్కెటకు బయట ప్రాంతాల నుంచి వాహనాల్లో టమటాలతో రైతులు వచ్చారు. సుమారు 1097 మెట్రిక్ టన్నుల కాయలు వచ్చాయి. ధరలు పెరుగుతుండటంతో బయట ప్రాంతాల రైతులు పెద్ద ఎత్తున మార్కెట్‌కు టమటాలను తరలిస్తున్నారు. మార్కెట్‌లోకి వాహనాలు అనుమతించకపోవడంతో రోడ్లపై వాహనాలు నిలిచిపోయాయి. టమాటా మార్కెట్ నుంచి చౌడేశ్వరి సర్కిల్, టిప్పు సుల్తాన్ కాంప్లెక్స్ వరకు వందలాది వాహనాలు రోడ్లపై నిలిచిపోయాయి. దీంతో సుమారు మూడు కిలో మీటర్ల వరకు వాహనాలు నిలిచిపోయాయి. పట్టణంలోకి రావాలంటే ఇబ్బందిగా మారింది. దీంతో పలు వాహనాలు బైపాస్‌రోడ్డు మీదుగా మళ్లించారు. మార్కెట్ వద్ద వాహనాలు ఇష్టానుసారంగా పెట్టారు. టమటా వాహనాలు క్రమబద్ధంగా మార్కెట్‌లోకి అనుమతించి ట్రాఫిక్ సమస్య రాకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. రోజు ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. టమటా సీజన్ సమయంలో వాహనాలను క్రమబద్ధీకరణ చేసి ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

దళితవాడల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి

పీలేరు : మండలంలో దళితవాడల అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అగ్రహారం పంచాయతీ ఎస్టీ కాలనీలో సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలోల ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తెస్తే సమస్యలు సత్వరం పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఎస్టీ కాలనీకి చెంచులక్ష్మీ అనే పేరు పెట్టాలని కోరారు. తాగునీటి ట్యాంకు ఏర్పాటు చేయాలని, స్మశాన వాటికకు స్థలం, అలయానికి, కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలన్నారు. సానుకూలంగా స్పందించిన అధికారులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ విజయ్‌రెడ్డి, ఎస్ఐ రమణ, పీఆర్ జేఈ తేజేశ్వర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ బాలాజినాయక్, వీఆర్‌వో రమణ, దళిత సంఘాల నాయకులు ధరణి, శ్రీనివాసులు, గట్టప్ప, వెంకటేష్ పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

తంబళ్లపల్లె: స్థానిక టీఎస్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో రెండవ విడత ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఎలక్ట్రిషియన్ ట్రేడ్‌లో 31, ఫిట్టర్‌లో 39, సివిల్‌లో 23 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పదో తరగతి పాస్, ఇంటర్మీడియట్‌లో పాస్ లేక ఫెయిలైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు జూలై నెల 24వతేదీ లోపు ఒరిజనల్ సర్టిఫికెట్లుతో ఐటీఐ కార్యాలయంలో వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలన్నారు. వెరిఫికేషన్ చేసుకున్న అభ్యర్థులకు మాత్రమే అర్హత పొందే అవకాశం ఉంటుందన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సేవలు అభినందనీయం



ఆర్టీసీ ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : పదవీ విరమణ పొందిన ఆర్టీసీ ఉద్యోగుల సేవలు అభినందనీయమని డీఎం బి. కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఆర్టీసీ డిపోలో పదవీ విరమణ పొందిన కండెక్టర్లు ఇ.ఎస్. మణ్యం, బి. కరీముల్లా, బి.వి. రమణ, ఎస్. అహమ్మద్‌లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 27 సంవత్సరాలుగా పీలేరు డిపోలో సేవలందించి ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. వారి శేష జీవితం సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. సీఐ సుబ్బమ్మ, ఎస్టీఐ బాబునాయక్, యూనియన్ నాయకులు ఖాదర్‌బాషా, జి.ఎస్. మణ్యం, కె.వి. రమణ, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు



లక్కీ డ్రా తీస్తున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం స్థానిక బస్టాండు నందు తంబళ్లపల్లె–మదనపల్లె మార్గంలో ప్రయాణికుల కోసం లక్కీడిప్ తీశారు. ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలన్నారు. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమన్నారు. లక్కీడ్రాలో మొదటి బహుమతి సంతోష్, రెండవ బహుమతి వి.లక్ష్మి రెడ్డి, మూడవ బహుమతి సి.పుష్పలత దక్కించుకున్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

పదవీ విరమణ ఉద్యోగులకు సన్మానం

ఆర్టీసీ–1 డిపోలోవిధులు నిర్వహించిన కండక్టర్లు ఎస్.ఎస్.వాసులు, పి.ఢిల్లీబాబు, డ్రైవర్ ఎం.డి.ఎన్.అలిలనుడీఎం ఘనంగా సన్మానించారు.

భక్తిశ్రద్ధలతో ప్రాకారోత్సవం

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో శనివారం ప్రాకారోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామికి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.భక్తులు స్వామిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ రమణ, మాజీ చైర్మన్ బింగి పాండు, అర్చకులు గోవర్ధన్‌భట్టార్‌లు పాల్గొన్నారు.